క్లుప్తంగా

‘డబుల్’ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించాలి



మాట్లాడుతున్న సమితి నాయకులు

జగిత్యాల: డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించాలని భారత సురక్ష సమితి నాయకులు కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్‌బెడ్రూం కేటాయింపుల్లో అనేక అవకతవకలు జరిగాయని, అనర్హులైన వారిని అర్హులుగా ప్రకటించారని ఆరోపించారు. ఏసీఎస్ రాజు, కాశీనాథం, గంగాధర్, దేవరాజం, భూమయ్య, గంగారాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం జరిపించారు. స్వామివారికి స్థానికులైన మిర్యాల దామోదర్‌రావు–రాజ్యలక్ష్మి దంపతులు వెండి కిరీటం బహూకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అరగుండాల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామ శివారుల్లోని అరగుండాల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1.41కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు వచ్చినట్లు నీటిపారుదల శాఖ ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్ తెలిపారు. గత వర్షాకాలం రోల్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో రోల్లవాగు దిగువన ఉన్న అరగుండాల ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తి అరగుండాల ప్రాజెక్టు కూడా పూర్తిగా తెగిపోయింది. దీంతో దీని కింద గడిచిన వానాకాలం, ప్రస్తుత యాసంగికి రైతులు పంటలు సాగుచేయలేదు. అరగుండాల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించడానికి ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొందని, సాంకేతిక పనులు పూర్తికాగానే పనులకు టెండర్లు పిలుస్తారని అధికారులు పేర్కొన్నారు.

రెండోరోజు విద్యుత్ ఉద్యోగుల ఆందోళన



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మెట్‌పల్లి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు రెండో రోజు గురువారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పీఆర్సీతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏడీఈలు మనోహర్, శ్రీనివాస్‌తో పాటు జగిత్యాల సర్కిల్ 1104 సెక్రటరీ దేవరాజ్, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా టీఎస్ ఆర్టీసీ సేవలు



బస్‌పాస్‌లు అందజేస్తున్న సిబ్బంది

పెగడపల్లి: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కొన్నేళ్లుగా సురక్షిత సేవలు అందిస్తోందని కరీంనగర్ రెండో డిపో మేనేజర్ మల్లయ్య అన్నారు. ఈ మేరకు పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో కరీంనగర్ రెండో డిపో ఆధ్వర్యంలో గురువారం ప్రజల వద్దకు ఆర్టీసీ సేవలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు ఆర్టీసీ ద్వారా రాయితీ పాస్‌లతో పాటు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పెగడపల్లిలో చదువుతున్న పలువురు విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మణ్, సీఆర్సీ లక్ష్మణ్, సేఫ్టీ వార్డెన్ సీహెచ్ ఎల్‌కే రావు, పూసల తిరుపతి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

సారంగాపూర్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని దానికి అనుగుణంగా ప్రణాళికలు ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని ధర్మపురి పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, ఇంపాక్ట్ ట్రైనర్ రేణిగుంట రమేశ్ సూచించారు. ఈ మేరకు గురువారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇంపాక్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం.. బోర్డుకే పరిమితం

- చాలా గ్రామాల్లో ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన అధికారులు
- రాజారాంపల్లిలో ప్రైవేట్ వ్యక్తుల పట్టా భూమిలో..
- క్రీడాకారులు లేక నిరుపయోగంగా ప్రాంగణాలు



వరిధాన్యం కొనుగోలు కేంద్రం స్థలంలో ఏర్పాటు చేసిన పాశిగామ క్రీడా ప్రాంగణం

వెల్గటూర్: గ్రామీణ ప్రాంతాల్లోని యువత, పిల్లల ఆరోగ్యం, శారీరక ధారుడ్యం పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను సేకరించి, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించి యువతను మైదానాల వైపు ఆకర్షించేలా క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసింది. అయితే క్షేత్ర స్థాయిలో సవాలక్ష సమస్యలతో కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. అనేక ప్రాంగణాల్లో లోపాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో ఊరికి దూరంగా ఏర్పాటు చేయడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు.

రూ.2.5 నుంచి రూ.4లక్షల అంచనా..

మండలంలో చాలాచోట్ల నామమాత్రంగానే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారనే విమర్శలు వినవస్తున్నాయి. సాధారణంగా ఓ మైదానం ఏర్పాటు కావాలంటే అన్ని సౌకర్యాలు ఉండాలి. ప్రస్తుతం ఉపాధి అధికారులు గుర్తించిన ప్రాంగణాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఇతర ఆటల కోర్టులు వేస్తున్నారు. స్థల సమస్య ఉన్నచోట ప్రత్యామ్నాయ పద్ధతుల్లో మైదానాలు ఏర్పాటు చేయాలి. అయితే ప్రభుత్వం మైదానాల చదును, క్రీడా సామగ్రి, ఎంపిక చేసిన స్థల విస్తీర్ణం బట్టి ఒక్కో క్రీడా ప్రాంగణానికి ఈజీఎస్ కింద రూ.2.50 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఖర్చు చేసి ప్రాంగణాలు ఏర్పాటు చేసి, ప్రాంగణం చుట్టూ మొక్కలు నాటాలి. కానీ చాలా ప్రాంగణాల్లో తూతూ మంత్రంగా బోర్డులు పెట్టి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఊళ్లకు దూరంగా ప్రాంగణాలు..

పట్టణాల్లో మినీ, భారీ స్టేడియాలు ఉండడంతో క్రీడాకారులు, పోలీసు ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేవాళ్లు ఆ స్టేడియాల్లో ప్రాక్టీస్ చేస్తారు. కానీ గ్రామాల్లో సరైన వసతులు లేకపోవడంతో నైపుణ్యం ఉన్న చాలా మంది క్రీడాకారుల ప్రతిభ మరుగున పడిపోతోంది. అలాంటి మారుమూల గ్రామాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కానీ చాలా వరకు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే స్థలాల్లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఊరికి దూరంగా ఏర్పాటు చేయడం, సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రీడాకారులు ఎవరూ ఈ ప్రాంగణాల వైపు చూడడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

ప్రైవేటు వ్యక్తుల పట్టా భూమిలో..

ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో ప్రైవేటు వ్యక్తుల పట్టా భూమిలో యజమానుల అనుమతి లేకుండా క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. ఇలా పట్టా భూముల్లో ఏర్పాటు చేయడంపై యజమానులు అధికారులను అడిగితే పై అధికారులు త్వరగా పూర్తిచేయాలనే ఒత్తిడి మేరకు ప్రస్తుతం బోర్డులు ఏర్పాటు చేశారని చెప్తున్నారు. త్వరలోనే తీసేస్తాం అని చెప్పి నెలలు గడుస్తున్నా.. తీయడం లేదని భూ యజమానులు వాపోతున్నారు.

ప్రభుత్వ స్థలం దొరక్కపోవడంతో..



రాజారాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం కేవలం తాత్కాలికంగా ఏర్పాటు చేసింది మాత్రమే. ప్రభుత్వ స్థలం దొరక్కపోవడంతో పట్టా భూమిలో ఏర్పాటు చేశాం. ప్రభుత్వ స్థలం దొరకగానే త్వరలోనే క్రీడా ప్రాంగణాన్ని అక్కడికి తరలిస్తాం.

– ఉదయ్‌కుమార్, తహసీల్దార్, ఎండపల్లి

అటెన్షన్ ప్లీజ్



డ్రైనేజీ శుభ్రం చేయించండి సారూ..!

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలోని పలు వార్డుల్లోని మురికి కాల్వల్లో చెత్త, మురికి పేరుకుపోయి దుర్గంధం వస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో డ్రైనేజీ అపరిశుభ్రంగా ఉండడంతో ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : మల్లారెడ్డి, ఎంపీడీవో, బీర్‌పూర్
ఫోన్ నంబర్ : 98491 94556

‘మీ సలహాలు.. సూచనలు ఇవ్వండి’

- ‘మీరు–నేను’ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ‘మీ సూచనలు, సలహాలు ఇవ్వాలి’ అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రజలను కోరారు. కాగా గురువారం రాత్రి ‘మీరు–నేను’ కార్యక్రమంలో భాగంగా బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో రాత్రి 9గంటలకు చేరుకుని గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట, కాలనీల్లో పర్యటించారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు వివిధ పథకాల కింద లబ్ధిపొందిన వారితో మాట్లాడారు. రాత్రి నర్సింహులపల్లెలో పల్లెనిద్ర చేశారు. కాగా శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే నర్సింహులపల్లె, కందెనకుంట గ్రామాల్లో పర్యటిస్తారని సమాచారం. ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీలు కొల్ముల రమణ, ముక్క శంకర్, సర్పంచ్ రిక్కల ప్రభాకర్, ఎంపీటీసీ ఎడ్ల సృజనాసుశీన్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మేరుగు రాజేశం పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేద ప్రజలకు వరం

జగిత్యాల: పేద ప్రజలకు కల్యాణలక్ష్మి వరమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో పట్టణ, రూరల్ మండలాలకు చెందిన 58 మంది ఆడబిడ్డలకు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహేశ్, దామోదర్, నారాయణ, ఆనందరావు, చాంద్‌పాషా, శంకర్ పాల్గొన్నారు.

రుద్రభూమికి నిధులు మంజూరు చేయాలి..

రుద్రభూమి కోసం నిధులు మంజూరు చేయాలని పట్టణ వీరశైవ సమాజం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. రుద్రభూమి కోసం నిధులు కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి..

ఇళ్లులేని నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని మహిళలు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. ఉదయం సెల్‌పాయింట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కాగా ఎమ్మెల్యే వారిని అభినందించారు.

శస్త్ర చికిత్సలను వినియోగించుకోవాలి

జగిత్యాల: శస్త్ర చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం పావని ఆస్పత్రిలో 21 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారు. డాక్టర్ విజయ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే ప్రాంగణాలు

రాయికల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఏపీఎల్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఎస్సై కిరణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



వార్షికోత్సవంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని రాఘవపేటలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మాధవాచార్యుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్‌ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్ నత్తి లావణ్య–నర్సయ్య దంపతులు, ఉపసర్పంచ్ ఎండీ అమినోద్దిన్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గురిజేల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కోరుట్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల చట్టాలు, హక్కులు, లింగ వివక్ష, హెల్ప్‌లైన్ నంబర్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.ప్రేమలత, మెప్మా టీఎంసీ సంధ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

ఇబ్రహీంపట్నం: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ కోరారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలో మహిళా దినోత్సవం ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడారు. లింగ వివక్షత, టోల్ ఫ్రీ నంబర్ 181, 1098 గురించి వివరించారు. ఏఎన్‌ఎంలు లలిత, ఎస్తెరు, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, ప్రమీల, రమాదేవి, మంజుల, రాజకళ, భాగ్యలక్ష్మి, రాధ పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా నిలవాలి

మల్లాపూర్: అభాగ్యులకు అండగా నిలవాలని సీడీపీవో తిరుమలదేవి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆమె అవగాహన కల్పించారు. సర్పంచ్ జోగుల మమత, ఎంపీటీసీ తోట సుజాత, ఉపసర్పంచ్ కొడిమ్యాల రవి, అంగన్‌వాడీ టీచర్లుపద్మ పాల్గొన్నారు.

సఖి ఆధ్వర్యంలో..

గొల్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ పంచాయతీ ఆవరణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మల్లక్కసత్తయ్య, ఉపసర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ లావణ్యజలపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, కార్యదర్శి జీవన్, ఐకేపీ సీపీ పూజిత, ఎఫ్‌ఏ సత్తవ్వ పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

మేడిపెల్లి: మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకుని మహిళలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకెళ్లాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. ఈ మేరకు గురువారం భీమారం మండలం పసునూరు గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల హక్కులు, సమానత్వం, వివక్ష వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి అధికారి గౌతమి, బాలల పరిరక్షణ విభాగం అధికారి పడాల సురేశ్, సర్పంచ్ లచ్చనాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆయాలు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడిక తొలగింపు



శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్టీసీ అవుట్ గేట్ పక్కనున్న డ్రైనేజీలో పూడికను గురువారం తొలగించారు. డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో అవుట్ గేట్ పక్కన ఉన్న కాల్వలో మురుగు నీరు, చెత్త పేరుకుపోయిన సంగతి తెలిసిందే. దీనిపై గురువారం ‘సాక్షి’లో ‘మురుగు.. ఎన్నాళ్లకు తొలుగును’ శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు మున్సిపల్ సిబ్బందితో కాల్వను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

కోరుట్ల: కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులు చేసుకుంటున్న ఆత్మహత్యలపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి మాడవేణి సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీచైతన్య కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సాత్విక్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవటం విచారకరమన్నారు. నాయకులు శివ, సాయికుమార్, వినయ్, మణిదీప్, ప్రమోద్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

రాయికల్: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలండ్ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడంతో గురువారం రాయికల్‌లోని పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగళారపు లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు ముత్యంరెడ్డి, నాయకులు పడాల తిరుపతి, మచ్చ నారాయణ, మల్లేశ్‌యాదవ్, సంజీవ్, తోపారపు ప్రసాద్, చిలువేరి ప్రవీణ్, కుంబోజి రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦సమస్యలు పరిష్కరించాలి

కథలాపూర్: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నవేని దశరథం గురువారం తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినందున ఒక్కో విద్యార్థికి రూ.25 చొప్పున చెల్లించాలని కోరారు.

✦పాఠశాల భవన పనులు పరిశీలన

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను ఎంఈవో భీమయ్య గురువారం పరిశీలించారు. సర్పంచ్ జమున, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీనివాస్, హెచ్‌ఎం జానకి ఉన్నారు.

✦సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో గల ఆలయాలకు టీటీడీ నిధులు రూ.40లక్షలు మంజూరైన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గురువారం గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ సత్యనారాయణ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గోపు ప్రశాంత్, నాయకులు చంద్రశేఖర్, లక్ష్మీరాజం, గంగారాం, అంజయ్య, గంగాధర్, రాజేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రఘు, నారాయణ పాల్గొన్నారు.

✦ప్రభుత్వ స్థలాల లీజు ఆలోచన విరమించుకోవాలి

మెట్‌పల్లి: పట్టణంలో ఆర్టీసీ డిపో, పాత మండల పరిషత్ స్థలాలను లీజుకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు అందె మారుతి, పిడుగు తిరుపతిరెడ్డి, కోటగిరి చైతన్య, చెన్నూరు శివ, జబ్బార్, రాజేశ్ పాల్గొన్నారు.

✦కల్వర్టు గోడ ఎత్తు పెంచాలి

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన బ్రిడ్జిని కల్వర్టు ఎత్తు పెంచాలని కోరుతూ గురువారం వీడీసీ అధ్యక్షుడు ఏలేటి జలేందర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ ఏఈకి వినతిపత్రం సమర్పించారు.

✦కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల కరాటే శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. యూసుఫ్‌నగర్ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, హెచ్‌ఎం శ్రీరాం కిషన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్, ఉపసర్పంచ్ రాజం, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజు, టీచర్లు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి సర్కారు ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: పల్లెల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నాచుపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖాన భవనానికి, తిర్మలాపూర్‌లో రూ.74లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం, మహిళా సంఘ భవనం, అంబేడ్కర్ సంఘ భవనం, పల్లె దవాఖాన, సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఇటీవల తిర్మలాపూర్ రైతులు తైదల అంజయ్య, తిప్పరవేణి నర్సవ్వ మృతిచెందగా వారి కుటుంబాలకు రైతుబీమా ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అంబటి లత, గంగుల పద్మ, ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్లు మేనేని రాజానర్సింగరావు, పోలు రాజేందర్, వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్, ఎంపీటీసీ బాసనవేని మహేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ పాల్గొన్నారు.

పసుపు రైతులకు మద్దతు ధర చెల్లించాలి



పసుపును పరిశీలిస్తున్న కృష్ణారావు

మల్లాపూర్: పసుపు రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని పాతదాంరాజుపల్లిలో పసుపు కల్లాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపునకు మద్దతు ధర చెల్లిస్తామని, ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయిస్తానని ఎంపీ అరవింద్ రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేసిన ఘనుడని ఆరోపించారు. ఇప్పటికైనా పసుపు రైతుల గోడును పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక మార్కండేయ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కోటగిరి ఆనంద్‌గౌడ్, మోహన్‌రెడ్డి, కొత్తూరి నారాయణరెడ్డి, గంగారెడ్డి, విలాస్, సత్యానారాయణగౌడ్ పాల్గొన్నారు.

సైనిక్‌స్కూల్ ఎంట్రెన్స్‌లో విద్యార్థి ప్రతిభ

కోరుట్ల: పట్టణానికి చెందిన కన్యాకుమారి గిరి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో సత్తా చాటింది. పట్టణంలోని కేరళ హైస్కూల్లో ఐదో తరగతి చదువుతున్న కన్యాకుమారి 2023 సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఫలితాల్లో 48,859 ర్యాంకు సాధించి సీటు సాధించింది. కన్యాకుమారిని కరస్పాండెంట్ ఎంపబారి, ప్రిన్సిపాల్ సెలీనా బారి అభినందించారు.

బీసీ రిజర్వేషన్లు 52శాతానికి పెంచాలి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

పెగడపల్లి: బీసీల రిజర్వేషన్లను 52శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాధికారం లేకనే బహుజనులు వెనుకబడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బహుజనుల సత్తా చాటాలని కోరారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెగడపల్లి మండల అధ్యక్షుడు నక్క గంగాధర్, ముంజ లీలగౌడ్, గజ్జెల స్వామి, కల్లెపల్లి తిరుపతి, శంకర్, సైదుల విజయ్ పాల్గొన్నారు.